క్లుప్తంగా

విద్యుత్ పొదుపుతో అభివృద్ధి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో విద్యుత్ పొదుపు కొనసాగినప్పుడే అభివృద్ధి త్వరగా సాధ్యమవుతుందని నూజివీడు ట్రిపుల్ ఐటీ అకడమిక్ డీన్ డాక్టర్ జ్యోతిలాల్‌నాయక్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో 'ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ ఇట్స్ ఇంపార్టెన్స్ ఫర్ సస్టేనబుల్ డెవలప్‌మెంట్ వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ పొదుపు ఆవశ్యకత అంశాలపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతిలాల్‌నాయక్ మాట్లాడుతూ.. దేశీయంగా ఇంధన వినియోగంలో వ్యవసాయ రంగం 18 శాతం వాటాను కలిగి ఉందన్నారు. సూక్ష్మ, బిందు, తుంపర సేద్య పద్ధతులను అవలంభించటం ద్వారా అదనంగా మరింత విద్యుత్ పొదుపును పాటించవచ్చని చెప్పారు. వాటితో పాటుగా గృహాల్లో వినియోగించే వివిధ వస్తువుల విద్యుత్ వినియోగంలో చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా నెల మొత్తం మీద పెద్దగా విద్యుత్ వాడకం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, విభాగాధిపతి ఏ శేఖర్‌సునీల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ జాతీయ పోటీలకు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: సాఫ్ట్ టెన్నిస్ జాతీయ పోటీలకు ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు ఎం.భావన, పి.లావణ్య ఎంపికయ్యారు. గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సింగిల్స్ పోటీల్లో భావన సిల్వర్, లావణ్య బ్రాంజ్ మెడల్‌ను సొంతం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన ఎంపిక పోటీల్లోనూ ఇరువురు క్రీడాకారిణులు అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 17వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, ఫిజికల్ డైరెక్టర్ వి.లక్ష్మీకనకదుర్గ క్రీడాకారిణులను అభినందించారు.

24న కేబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ఒమ్నీ స్టూడెంట్స్ అసోసియేషన్(పూర్వ విద్యార్థుల సంఘం) ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు డీపీ రామకృష్ణ తెలిపారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం పోస్టర్‌ను ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధానకార్యదర్శి, పూర్వ విద్యార్థి గోపిశెట్టి మల్లయ్య ఆవిష్కరించారు. అనంతరం డీపీ రామకృష్ణ మాట్లాడుతూ కేబీఎన్ కళాశాల స్థాపించి 58 సంవత్సరాలుగా విజయవంతంగా కొనసాగుతుందన్నారు. శాసనసభ్యులు, ఏపీఎస్‌లు, న్యాయవాదులు, శాస్త్రవేత్తలు, రాజకీయవేత్తలు, క్రీడాకారులు, కళాకారులు అనేక రంగాల్లో ఎందరో మేధావులను సమాజానికి అందించిన ఘనత కేబీఎన్ కళాశాలకు దక్కుతుందన్నారు. వివిధ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అన్ని గ్రూప్‌లకు సంబంధించి ఆయా సంవత్సరాల్లో బయటకు వచ్చిన పూర్వ విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంఘం కార్యదర్శి జల్లూరి శ్రీనివాసరావు, కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు కళాశాల స్థాయిలోనే ఉత్తమ పౌరులుగా ఎదిగే దిశగా విద్యా సంస్థలు కృషి చేయాలని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిషోర్ అన్నారు. కళాశాల ఆవరణలో వికసిత్ భారత్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. చదువుతో పాటు సామాజిక అంశాల పట్ల అవగాహన పెంచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని కాంక్షించారు. స్మార్ట్ సిటీస్ ఫర్ ఏ స్మార్ట్ టుమారో, అర్బన్ డెవలెప్‌మెంట్ ఇన్ వికసిత్ భారత్ అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ఇదే అంశంపై పెయింటింగ్ కాంపిటీషన్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. అనంతరం విద్యార్థులు వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- 40వ డివిజన్‌లో ఆరోగ్యశ్రీ స్మార్ట్ హెల్త్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆరోగ్య శ్రీ వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. భవానీపురం 40వ డివిజన్ 123వ సచివాలయం పరిధిలో మంగళవారం ఆరోగ్యశ్రీ స్మార్ట్ హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వెలంపల్లి లబ్ధిదారులకు నూతన ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించాలని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభించారన్నారు. కొన్ని లక్షల మందికి వైద్యం చేయించి ఆరోగ్య ప్రధాతగా వైఎస్ పేరు పొందారన్నారు. ఆయన మరణం తర్వాత వచ్చిన చంద్రబాబు ఆరోగ్యశ్రీని పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రజలకు వైద్యాన్ని భారం చేశారన్నారు. ప్రైవేటు ఆస్పత్రులను బలోపేతం చేసే విధంగా పనిచేశారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక తిరిగి ఆరోగ్య శ్రీ సేవలను మెరుగుపరుస్తూ వస్తున్నారన్నారు. అధికారం చేపట్టే నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 700 ఆస్పత్రుల్లో మాత్రమే ఆరోగ్య శ్రీ వర్తించేదని, ప్రస్తుతం ఆ సంఖ్య 2,513 ఆస్పత్రులకు పెంచి ఆరోగ్య శ్రీ సేవలు విస్తరించారన్నారు. గతంలో కేవలం 1,059 వ్యాధులకు మాత్రమే ఆరోగ్య శ్రీ ఉండగా ప్రస్తుతం 3,257 వ్యాధులను ఆరోగ్య శ్రీ పరిధిలోకి చేర్చారన్నారు. నాలుగున్నరేళ్లలో ఆరోగ్యానికి రూ.14,490 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. అదే విధంగా గతంలో 11 వైద్య కళాశాలలు మాత్రమే ఉండేవని వాటితో మరో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నిషియన్లకు కొరత లేదన్నారు. ప్రజలంతా ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య శ్రీపై అవగాహన కల్పించడంతోపాటు ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డును అందజేస్తున్నట్లు తెలిపారు.

యువగళం యాత్ర కాదు..

లోకేష్ చేసేది పాదయాత్ర కాదని.. అది కేవలం ఈవెనింగ్ వాక్ అని ఎమ్మెల్యే వెలంపల్లి ఎద్దేవా చేశారు. పాదయాత్ర అంటే మహానేత వైఎస్సార్, జననేత వైఎస్ జగన్ చేశారని, వాటి ద్వారా పాలనలో ఎంతో మార్పు తెచ్చారన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారంలోకి రాగానే వాటికి పరిష్కారం చూపారన్నారు. చంద్రబాబు కూడా పాదయాత్ర చేశారని, కానీ చెప్పుకోదగ్గ ఏ ఒక్క పథకం తేలేకపోయారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు ఏ ఒక్క మేలు చేయలేదన్నారు. తాము తప్పు చేశామని చంద్రబాబు, లోకేష్ రాష్ట్ర ప్రజలను క్షమాపణ కోరాలన్నారు. చంద్రబాబు, పవన్ ఇద్దరూ హైదరాబాద్ వాసులే గానీ ఆంధ్ర వాసులు కాదన్నారు. వారికి రాష్ట్ర ప్రజల సమస్యలు పట్టవని తెలిపారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, నాయకులు మల్లెల శ్రీనివాసరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, నడికట్టు రమణారెడ్డి, ఉడుముల వీరారెడ్డి, వెన్న వెంకట సుబ్బారెడ్డి, కేసరి రాజశేఖర్ రెడ్డి, జవ్వాజి లక్ష్మి కుమారి, షేక్ బడేమియా, ఎస్.శివరామిరెడ్డి, దొడ్డా రాజశేఖర్ రెడ్డి, బత్తుల కొండారెడ్డి, వినుకొండ మాలకొండయ్య, కిక్కిరి కోటిరెడ్డి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీకి చెందిన కోనకంచి రత్నకుమారి, విశ్వనాథంలు భార్యభర్తలు. వీరి కుమార్తె గోవాడి ప్రశాంతికి వివాహం కాగా ఇద్దరు సంతానం. ప్రశాంతికి భర్తతో విభేదాల కారణంగా తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ప్రశాంతికి కొంత కాలం కిందట సంజీవ్ అనే వ్యక్తితో పరిచయమైంది. ఇటీవల ప్రశాంతి లెనిన్‌సెంటర్‌లోని వస్త్ర దుకాణంలో పని చేస్తానని చెప్పి వెళ్లింది. 18వ తేదీ షాపునకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ప్రశాంతి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. రాయప్పరాజు వీధికి చెందిన తల్లని బాలసుబ్రహ్మణ్య మహేంద్రకుమార్ అక్క, బావలు గుంటూరు కంభంపాడులో ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె(16) బెంజ్‌సర్కిల్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుతుంది. ఆదివారం సాయంత్రం బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇంటిలో నగదు కూడా కనిపించకపోవడంతో మహేంద్రకుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్వాములకు అన్నప్రసాద వితరణ అభినందనీయం



అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నియమ, నిష్ఠలతో మాలాధారణ చేసిన స్వాములకు అన్నప్రసాద వితరణ చేయటం అభినందనీయమని, నిర్వాహకులకు అయ్యప్ప స్వామి అనుగ్రహానికి పాత్రులవుతారని నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాంపిళ్ల లక్ష్మణరావు గురుస్వామి దివ్య ఆశీస్సులతో ఎస్ఎస్ఆర్ సిమెంట్ కాంక్రీట్ వర్క్స్ అధినేత శేఖర్ స్వామి ఆధ్వర్యంలో గొల్లపూడి పరిధిలోని హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ పక్కన ఏర్పాటు చేసిన గోపాల కృష్ణ మందిరంలో గోశాల అర్చకులు ఎస్ఎస్ఎన్ ఆచార్యుల పర్యవేక్షణలో గత నెల 17వ తేదీ నుంచి అయ్యప్ప, శివ, గోవింద స్వాములకు అన్న ప్రసాద వితరణ జరుగుతుంది. అలాగే ప్రతి రోజూ లక్ష్మీగణపతి హోమం జరుగుతుంది. ఈ క్రమంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గ గుడి పాలక మండలి సభ్యుడు కట్టా సత్తెయ్య పాల్గొన్నారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణలో వెలంపల్లి స్వాములకు వడ్డించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎస్ఎస్ఎన్ శేఖర్ స్వామి మాట్లాడుతూ తన 18వ పడి సందర్భంగా ప్రతి రోజూ 600 నుంచి 800 మంది స్వాములకు అన్న ప్రసాదాన్ని అందిస్తున్నామని తెలిపారు. జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ నెల 23వ తేదీ ముక్కోటి సందర్భంగా పడిపూజ నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేటి సెమీ క్రిస్మస్ వేడుకలకు పటిష్ట బందోబస్తు



విజయవాడస్పోర్ట్స్: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 20వ తేదీ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. స్టేడియంలో చురుగ్గా జరుగుతున్న కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఆయన పర్యవేక్షించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని అత్యంత పగడ్బందీగా చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. సీపీ వెంట అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, డీసీపీ వి.అజిత, ఏసీపీ పి.భాస్కరరావు ఉన్నారు.

మామిడి తోటల ధ్వంసంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మామిడి తోటలను ధ్వంసం చేసిన వ్యక్తులపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట గున్నాబత్తుల అచ్చయ్య వీధికి చెందిన లేళ్ల విజయలక్ష్మి(64)కి నైనవరం గ్రామంలో 4.60 ఎకరాల పొలంలో మామిడి తోటలు ఉన్నాయి. 17వ తేదీ కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోకి ప్రవేశించి మామిడి తోటలను ధ్వంసం చేస్తున్నట్లు తెలిసింది. దీంతో అక్కడికి చేరుకునే సరికి జేసీబీలతో తోటలను ధ్వంసం చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మొబైల్ కోర్టులో 15 కేసులు విచారణ



కేసులు విచారణ చేస్తున్న మున్సిపల్ జడ్జి విజయ్‌కుమార్‌రెడ్డి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని సర్కిల్ – 2 కార్యాలయంలో జరిగిన మొబైల్ కోర్టులో మంగళవారం మున్సిపల్ జడ్జి బి.విజయ్ కుమార్‌రెడ్డి 15 కేసులు విచారించారు. రహదారులపై చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టినందుకు సర్కిల్–2 పరిధిలో ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన ఆయా కేసులను విచారించి బాధ్యుల నుంచి రూ.7,890 జరిమానా వసూలు చేశారు. ఒకసారి జరిమానా విధించాక రెండోసారి కూడా ఆ తప్పు చేస్తే కఠినంగా చర్యలు తీసుకొని లైసెన్స్ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్–2, డాక్టర్ వి.రామకోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్–4 ఎం.మహేష్ బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

22న బీసీ రథయాత్రకు తరలిరండి



రథయాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీలకు శాసనసభలో 90 శాతం, పార్లమెంట్‌లో 13 శాతం స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 22వ తేదీన నిర్వహించే బీసీ రథయాత్రకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ ఇన్‌చార్జి వై.నూకాలమ్మ పిలుపునిచ్చారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రథయాత్ర వాల్‌పోస్టర్లు, కరపత్రాలను పలువురు బీసీ సంక్షేమ సంఘం నేతలు ఆవిష్కరించారు. అనంతరం బీసీ నాయకుడు శీరం నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూకాలమ్మ మాట్లాడుతూ.. బీసీల రాజాధికారం కోసం మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని కోరుతున్నామని, అలా కేటాయించిన వారికే మద్దతు తెలుపుతామన్నారు.

జాతీయ పార్టీలు 275 పార్లమెంట్ స్థానాలను, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విజయవాడ సిటీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కనిశెట్టి లక్ష్మణరావు, సంఘం విజయవాడ ఉపాధ్యక్షుడు తమ్మిన దుర్గారావు, బీసీ లీగల్ సెల్ కన్వీనర్, పిళ్లా శ్రీనివాసరావు, సుకాశి సరిత, పీసా అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలి

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- 44వ డివిజన్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్'



సంక్షేమ, అభివృద్ధి సూచిక బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, రత్నకుమారి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజానీకం ఆకాంక్షిస్తుందని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 44వ డివిజన్‌లోని 157వ సచివాలయం దగ్గర మంగళవారం ఏర్పాటు చేసిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సచివాలయం పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు చేకూరిన లబ్ధితోపాటు ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డును నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారితో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం వారు వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు.

గ్రాఫిక్స్‌తో టీడీపీ మభ్యపెట్టింది..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి, గత టీడీపీ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించేందుకే 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి అవసరమని వెలంపల్లి అన్నారు. గత టీడీపీ పాలనలో ప్రజలను గ్రాఫిక్స్‌తో మభ్యపెట్టి మోసం చేశారన్నారు. సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాలతోపాటు వైద్య సేవలు కూడా గడప వద్దకే వచ్చాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు తాత్కాలిక రాజధాని పేరుతో చంద్రబాబు అండ్ కో అందినకాడికి దోచుకున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో దోచుకో.. దాచుకో.. తినుకో అనే విధంగా పాలన సాగిందని తెలిపారు. వక్ఫ్‌బోర్డ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, పార్టీ నాయకులు వీరంకి సత్యనారాయణ, ముత్తా వాసు, రెడ్డిపల్లి రాజు, సంభాన బాబూరావు, ఎ.పూర్ణకనకారావు, ఇనపకుర్తి రాము, వల్లం రవికుమార్, ఉండభట్ల దుర్గారావు, వల్లెపు రాము, అద్దేపల్లి సత్యనారాయణ, జి.కొండలరావు, కె.జోజి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు స్విమ్మర్ల ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్విమ్మర్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు బెంగళూరు వేదికగా జరిగే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్ స్విమ్మర్లు ఎంపికైనట్లు కోచ్ రఫీ పేర్కొన్నారు. కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోటీలకు ఎంపికైన విద్యార్థులను పలువురు సీనియర్ స్విమ్మర్లు అభినందించారు. ఈ నెల 16, 17వ తేదీల్లో నరసరావుపేటలో నిర్వహించిన 9వ సబ్ జూనియర్స్, జూనియర్స్ వింటర్ అక్వాటిక్ చాంపియన్స్ పోటీల్లో కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న పలువురు విద్యార్థులు హాజరయ్యారు. వారిలో కెహెచ్. మేఘన 50, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో రజిత పతకం, 200 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో రజిత పతకాన్ని సాధించింది. ఓ.వెంకటఅశ్విత గగన 50 మీటర్ల ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్‌లో కాంస్య పతకాలు, కె.భవేష్ 1500 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకాన్ని ఎన్. సుమతి హర్షిక వాటర్‌పోలో విభాగంలో పతకాలను సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు ఐ.రమేష్, బి.బాలు అభినందించారు.

ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ల అందజేత



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం గుప్తా సెంటర్‌లోని షాదీఖానాలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ఇందులో భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి భోగవల్లి శ్రీధర్, పశ్చిమ కన్వీనర్ పాట్టి శ్రీహరి, మండల అధ్యక్షుడు పచ్చిపులుసు వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు బలివాడ శివకుమార్ పటాన్నాయక్ పాల్గొని కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఉజ్వల పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆరోగ్యానికి ఆయుష్మాన్ భారత్ కార్డులు వంటి పథకాలతో లబ్ధి పొందాలని ఆయన పేర్కొన్నారు. 39వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గన్నవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి, వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ రూ.25 వేలు విలువ చేసే ఇస్త్రీ బండిని మంగళవారం అందజేశారు. గాయత్రినగర్‌లోని శ్రావ్య టవర్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పచ్చిపాల రామకృష్ణకు జీవనోపాధి నిమిత్తం బండిని అందించారు. తోటి వారికి సహాయం చేయడంలో ముందుంటామని జయప్రకాష్ చెప్పారు.





ఉత్సాహంగా బాలోత్సవం

నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో 6వ అమరావతి బాలోత్సవం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



